క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో వెంకటగిరి విద్యార్థి ప్రతిభ



శ్రీహరిని అభినందిస్తున్న సీఐ ఏవీ రమణ

వెంకటగిరి(సైదాపురం) : నెల్లూరులోని జేఎన్‌టీయూ ఇంటర్ యూనియవర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో వెంకటగిరికి చెందిన విజయ్ చెస్ అకాడమీ విద్యార్థి రాచకొండ శ్రీహరి ప్రతిభ చూపాడు. అతన్ని సీఐ ఏవీ రమణ పోలీసుస్టేషన్‌కు పిలిపించి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం కొంతసేపు విద్యార్థితో కలిసి చెస్ ఆడారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. చెస్ నిర్వాహకులు నర్రా వినయ్ మాట్లాడుతూ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 136 మంది క్రీడాకారులు పాల్గొనగా శ్రీహరి 5 రౌండ్లకు గాను 4 రౌండ్లలో ప్రతి భ చూపి 9వ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు.

రేపు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించనున్నట్టు సీపీఐ నాయకులు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం సమావేశానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం నాన్చుడు ధోరణిని అవలంబిస్తోందన్నారు. అలాగే డివిజన్‌లో పలు భూసమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు పెత్తందార్లకు వత్తాసు పలుకుతూ పేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వీటిపై చర్చించేందుకు మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ ప్రభాకర్, కాలేషా, శశి కుమార్, ఎంబేటి చంద్రయ్య, శీనయ్య, శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


రైల్వే బోర్డు మెంబర్‌గా పామంజి కృష్ణయ్య



రైల్వే అధికారుల నుంచి గుర్తింపు కార్డు అందుకుంటున్న కృష్ణయ్య

వాకాడు : విజయవాడ రైల్వే డివిజన్ బోర్డు మెంబర్‌గా వాకాడు మండలం తిరుమూరు గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పామంజి కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం కృష్ణయ్యకు విజయవాడ రైల్వే బోర్డు అధికారులు గుర్తింపు కార్డు అందజేశారు. తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం తనను రైల్వే బోర్డులో సభ్యుడిగా చేర్చడం సంతోషంగా ఉందని కృష్ణయ్య తెలిపారు.

ఆక్వా చెరువుల వద్ద విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చోరీ



తిరుమూరులో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

వాకాడు : మండలంలోని తిరుమూరు గ్రామంలో ఆక్వా చెరువుల వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు చోరీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. వారు ఆదివారం విలేకరులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ గ్రామంలో దాదాపు 175 ఎకరాల్లో ఆక్వా సాగు ఉందన్నారు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, దాణా ఖర్చులు పెరగడంతో కొన్ని నెలలుగా ఆక్వా సాగు నిలిచిపోయిందని తెలిపారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రిపూట తమ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి విలువైన కాపర్ వైర్లు, కాపర్ పరికరాలను చోరీ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 11 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్టు వాపోయారు. సొంత నిధులతో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నామని, పోలీసులు నిఘా పెట్టి దుండగులను అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

రూ.25 వేలు ఇస్తే రైట్.. రైట్



శిరసనంబేడు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

కొందరు ఇసుక వ్యాపారులు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. రాత్రిళ్లు స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వి రహస్య ప్రదేశంలో డంప్ చేస్తున్నారు. తర్వాత రాత్రికి రాత్రి లారీల్లో చెన్నైకి తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు మామూళ్లు తీసుకుని అక్రమార్కులకు సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రభుత్వ కార్యాలయాల్లో కూర్చొని అధికారులతో మంతనాలు చేస్తూ బేరం కుదురుస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఇసుక తరలింపుతో స్వర్ణముఖి నదిలో భూగర్భ జలాలు అడుగంటి పంటల సాగు ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- మండల కార్యాలయాల్లోనే మామూళ్లపై మంతనాలు
- స్వర్ణముఖినదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- అటవీ ప్రాంతాల్లో డంపింగ్, రాత్రిళ్లు లారీల్లో చెన్నైకి తరలింపు

పెళ్లకూరు : మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గతంలో కొందరు ఇసుకాసురులు వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించేవారు. వారి మధ్య సఖ్యత లేకపోవడంతో మూడు వర్గాలుగా ఏర్పడి స్వర్ణముఖినది సాక్షిగా ఒకరిపై ఒకరు దాడులకు దిగినట్టు సమాచారం. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు తమ రూటు మార్చారు. పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, పెళ్లకూరు, రావులపాడు, చావలి గ్రామాల వద్ద స్వర్ణముఖినదిలో ఇసుక తవ్వకాలు చేసి బాలాయపల్లి మండలంలోని మేల్పూరు, శిరసనంబేడు సమీపంలోని అటవీ ప్రాంతంతోపాటు మేనకూరు సెజ్‌లోని ఒక పరిశ్రమ వద్ద డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీలతో చెన్నైకి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెన్నైలో లారీ ఇసుక రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు ధర పలుకుతోంది. మరికొందరు వెంకటగిరి, శ్రీకాళహస్తి పట్టణాలకు తరలించి ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.5,500 నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు.

మామూళ్లు చెల్లిస్తే చాలు

ఒక్కో ట్రాక్టర్ యజమాని అధికారులకు నెల మామూళ్లు చెల్లిస్తే ఇసుక వ్యాపారులందరూ చుట్టాలే. కొందరు అధికారపార్టీ నాయకులు నేరుగా కార్యాలయాల్లో కూర్చొని అధికారులతో బేరాలు కుదిర్చేందుకు మంతనాలు చేస్తున్నారు. పెళ్లకూరులో రూ.25 వేలు, బాలాయపల్లిలో రూ.10 వేలు, వెంకటగిరిలో రూ.15 వేలు, శ్రీకాళహస్తిలో రూ.10 వేలు ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కోసారి ఉన్నతాధికారుల ఆదేశాలతో దాడి చేసే అధికారులు మామూళ్లు చెల్లించని ట్రాక్టర్లను మాత్రమే పట్టుకుని మిగిలిన వాటిని వదిలేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అధికారులే మామూళ్లు తీసుకుని ఇసుక అక్రమ రవాణాను పోత్సహిస్తే స్వర్ణముఖినదిని కాపాడేదెవరని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, తాళ్వాయిపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖినదిలో భారీగా తవ్వకాలు చేపట్టడంతో కిలోమీటర్ల మేర గడ్డి పొదలు దర్శనమిస్తున్నాయి.

నీటికి తప్పని గండం

స్వర్ణముఖినది నుంచి ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి కష్టాలు మొదలయ్యాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో సుమారు పదివేల ఎకరాల వరకు భూములకు సాగునీరు, 17 గ్రామాలకు తాగునీరు అందించే మంచినీటి పథకాలకు నీటిగండం పొంచి ఉంది. ఇప్పటికే పలుచోట్ల స్వర్ణముఖినదిలో ఇసుక పూర్తిగా తోడేయడంతో గడ్డి పొదలు దట్టంగా పెరిగిపోయి దర్శనమిస్తున్నాయి. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్న మండల స్థాయి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



యంత్రాలతో ఇసుకను లోడింగ్ చేస్తున్న అక్రమార్కులు



స్వర్ణముఖినదిలో నిరుపయోగమైన వ్యవసాయ మోటార్లు



కలవకూరు కాజ్‌వే వద్ద స్వర్ణముఖిలో ఇసుక తోడేయడంతో పెరిగిన గడ్డి పొదలు

ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంక్



కుప్పారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ (ఇన్‌సెట్) దెబ్బతిన్న సేఫ్టీ గ్రిల్

దొరవారిసత్రం : కుప్పారెడ్డిపాళెంలోని ఎస్సీ కాలనీ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో జేజేఎం నిధులు రూ.16 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణంతోపాటు బోరు పాయింట్, వీధుల్లో పైపులైన్, ప్రతి ఇంటికీ నీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. పనులు పూర్తయి ఆరు నెలలు దాటింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు సక్రమంగా రాకపోవడంతో విద్యుత్ కనెక్షన్ ఇప్పించలేదు. దీంతో ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభం కాలేదు. ఇప్పటికే మెట్లకు ఉన్న సేఫ్టీ గ్రిల్ మరమ్మతులకు గురై విరిగిపోయాయి. ప్రస్తుతం కాలనీలో విద్యుత్ ఉన్న సమయంలో మాత్రమే పథకం నీరు అందుతోంది. కరెంటు లేని సమయంలో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

నాయుడుపేట టౌన్ : తిరుపతి జిల్లా పరిధిలో కేటాయించిన 227 ప్రయివేటు మద్యం షాపులకు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ తిరుపతి, చిత్తూరు జిల్లాల డిప్యూటీ కమిషనర్ టి.విజయశేఖర్ తెలిపారు. ఆయన ఆదివారం నాయుడుపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రయివేటు మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మూడు విధానాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని, 11 తేదీన జిల్లా కలెక్టర్ సమక్షంలో డిప్ ద్వారా షాపులను కేటాయిస్తామని చెప్పారు. నాయుడుపేట సర్కిల్‌లో 17, సూళ్లూరుపేటలో 21, వెంకటగిరిలో 15, గూడూరులో 18, వాకాడులో 15 మద్యం షాపులకు అనుమతి వచ్చినట్టు తెలిపారు. షాపులను దక్కించుకున్నవారు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వారికి నచ్చిన చోట పెట్టుకోవచ్చన్నారు. తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే.నాగమల్లేశ్వరరెడ్డి, గూడూరు ఏఈఎస్ పీఎస్ ఊహసిరిరెడ్డి, నాయుడుపేట సీఐ ఇండ్ల అరుణకుమారి, గూడూరు స్క్వాడ్ సీఐ ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి పరిధిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలకు అనుమతి వచ్చినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ తెలివారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి పట్టణంలో 9, బాలాయపల్లిలో 3, డక్కిలిలో 3 దుకాణాలు కేటాయించినట్టు తెలిపారు.

ధైర్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి








రాపూరు: ధైర్యలక్ష్మిగా ఆదిలక్ష్మీదేవి, అన్నపూర్ణగా అంకమ్మ, కన్యకాపరమేశ్వరి, బాలాత్రిపుర సుందరిగా రాపూరమ్మ, నాయుడుపేట టౌన్ : లలితా త్రిపుర సుందరిగా పోలేరమ్మ, పార్వతీదేవిగా మూకాంబికాదేవి

వెంకటగిరిరూరల్/రాపూరు/చిట్టమూరు (వాకాడు) /సూళ్లూరుపేట/గూడూరు రూరల్ :

- రాపూరు పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉన్న ఆదిలక్ష్మీదేవి అమ్మవారు ఆదివారం రాత్రి ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్నపన తిరుమంజనం, రాత్రి 9 గంటలకు దర్బారు సేవ నిర్వహించారు. వేపినాపి సమీపంలోని అంకమ్మ అమ్మవారు అన్నపూర్ణగా భక్తులను అనుగ్రహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాపూరులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు. రాపూరు గ్రామదేవత రాపూరమ్మ బాలాత్రిపుర సుందరిదేవిగా అనుగ్రహించారు. పర్వతివర్ధనిదేవి అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.
- నాయుడుపేట పట్టణంలో వెలసిన పోలేరమ్మ లలితా త్రిపుర సుందరి దేవిగా, మూకాంబిక దేవి పార్వతీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి, తిమ్మాజి కండ్రిగ గ్రామసమీపంలోని స్వర్ణముఖి నదీతీరాన ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరిదేవి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు.
- చిట్టమూరు(వాకాడు) : మండలంలోని మల్లాంలో వెలసిన మార్కేండేశ్వర సామి ఆలయంలోని కామాక్షిదేవి ఆదివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గునపాటిపాళెం గ్రామానికి చెందిన బి వెంకయ్య శెట్టి, శ్యామలమ్మ దంపతులు, వంకా రమణయ్య, శ్రీనివాసులు బ్రదర్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.
- ఓజిలి: దేవీ నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు ఓజిలి గ్రామదేవత నాగార్పమ్మ ఆదివారం మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.
- సైదాపురంలో ఉన్న బాలా త్రిపుర సుందరిదేవీ అమ్మవారు ఆదివారం గౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం, పూలంగి సేవ, లలిత సహస్రపారాయణం, రుద్రాభిషేకం చేశారు.
- వెంకటగిరి పట్టణంలోని కర్ణకమ్మవీధిలో ఉన్న శ్రీ హరిహర క్షేత్రంలో కాత్యాయని అమ్మవారు సంతానలక్ష్మిగా, శ్రీ వెంకటేశ్వరస్వామి నృసింహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. వెలమాపాళెం సమీపంలో ఉన్న మందనాంచారమ్మ అమ్మవారు అన్నపూర్ణదేవిగా, కన్యకాపరమేశ్వరి పద్మావతిగా భక్తులను అనుగ్రహించారు.
- గూడూరు పట్టణంలోని పటేల్ వీధిలో ఉన్న సాయి సత్సంగ నిలయంలో వెలసిన విజయదుర్గా అమ్మవారు లలితా త్రిపుర సుందరీగా భక్తులను అనుగ్రహించారు.

బాలాత్రిపుర సుందరీ అలంకారంలో చెంగాళమ్మ పరమేశ్వరి



సూళ్లూరుపేట : చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు నాలుగోరోజైన ఆదివారం బాలాత్రిపురసుందరీగా దర్శనం ఇచ్చారు. ముందుగా యాగశాలలో మహా చండీయాగాన్ని ఘనంగా చేపట్టారు. బాలాత్రిపుర సుందరి అలంకారానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి-మమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. చండీయాగానికి సూళ్లూరుపేటకు చెందిన చిట్టేటి పెరుమాళ్లు-గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి సారెలు

చెంగాళమ్మ పరమేశ్వరికి ఆదివారం కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, రాజీవ్‌నగర్, ఇసుకమిట్ట, రైల్వే గేట్, హనుమాన్‌వీధికి చెందిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో చీరలు, రవికెలు, పండ్లు తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మీ స్వాగతం పలికి అమ్మవారికి సారె సమర్పించేలా ఏర్పాట్లు చేశారు.



చిట్టమూరు : అన్నపూర్ణాదేవిగా కామాక్షిదేవి,



ఓజిలి: ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ



సైదాపురం: గౌరీదేవిగా బాలాత్రిపుర సుందరి,



వెంకటగిరి రూరల్: పద్మావతిగా కన్యకాపరమేశ్వరి



అన్నపూర్ణగా మందనాంచారమ్మ



సంతానలక్ష్మిగా కాత్యాయని అమ్మవారు



గూడూరు రూరల్ : లలిత త్రిపుర సుందరీగా విజయదుర్గ

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

కోట: మండలంలోని తీరప్రాంతంలో పరిశ్రమల కోసం సేకరించిన భూములకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. వారు ఆదివారం కొత్తపట్నంలో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఇక్కడ క్రిస్‌సిటీ ఏర్పాటు కోసం రైతుల నుంచి భూములు తీసుకున్నారని తెలిపారు. నష్టపరిహారం చెల్లించిన తర్వాతే గ్రామసభ పెట్టాలన్నారు. క్రిస్ సిటీ, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం కొత్తపట్నం పరిధిలో మొత్తం 962 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. వీటిలో పట్టా భూములు 286 ఎకరాల, డీకేటీ 202 ఎకరాలు, ప్రభుత్వ భూములు 474 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. పట్టా భూములకు కొంత వరకు నష్ట పరిహారం చెల్లించారని, మిగతా భూములకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. 2021లో అప్పటి గూడూరు సబ్‌కలెక్టర్ పట్టా భూములకు ఎకరాకు రూ.21.75 లక్షలు, డీకేటీ భూములకు ఎకరాకు రూ.15 లక్షలు చెల్లిస్తామని చెప్పారని పేర్కొన్నారు. నాలుగేళ్లు గడిచిన క్రమంలో భూముల విలువను పెంచి రేట్లు నిర్ణయించాలని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న నిర్వాహకుడు సుబ్బారెడ్డి

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని తిప్పవరపాడులో ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు గ్రామస్తులు అగ్నిగుండంలో ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బత్తల సుబ్బారెడ్డి దాతృత్వంతో అగ్ని గుండ ప్రవేశ ఉత్సవం నిర్వహించారు. ఇందులో చిల్లకూరు మండలం పొన్నవోలుకు చెందిన పండరి భజన గురువు టీవీ క్రిష్ణదాసు భజన బృందం పండరి భజనలు, కులుకు భజనలు, జడ కోలాటాలు చేపట్టారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో హారతి పళ్లెంతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. వారి వెనుక గ్రామస్తులు అగ్ని గుండంలో ప్రవేశించారు.

ఘనంగా కాలగంధమ్మ విగ్రహ ప్రతిష్ట



కాలగంధమ్మ ఆలయం వద్ద గ్రామస్తులతో వెందోటి కార్తీక్‌రెడ్డి

బాలాయపల్లి(సైదాపురం) : మండలంలోని కాలగంధ గ్రామంలో నిర్మించిన ఆలయంలో ఆదివారం కాలగంధమ్మరి విగ్రహ ప్రతిష్టను గ్రామస్తులు ఘనంగా చేపట్టారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి గ్రామానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెళ్లకూరు: ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునిసుబ్రమణ్యం తెలిపారు. తాళ్వాయిపాడులో ఆదివారం రాత్రి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు మురళీ పాల్గొన్నారు.

రక్త నిధి ప్రారంభం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలో రక్త నిధిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జాండ్రవీధిలో ఏర్పాటుచేసిన మెడ్ ప్లస్ రక్త నిధిని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో రక్తం కోసం నెల్లూరుకు వెళ్లాల్సి వచ్చేదని, గూడూరులోనే రక్త నిధిని ఏర్పాటు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, జగన్, సురేష్, వేగూరు రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 26.955 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 26.955 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 1250, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8000 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు.

రోడ్డును బాగు చేయండి మహాప్రభో



సైదాపురం: మండలంలోని సైదాపురం-పొదలకూరు రోడ్డు గుంతలమయమైంది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.